ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

శనివారం 7 జూన్ 2025





ఊరూరా పరేషాన్!

- మూడు నెలల బియ్యం కోసం లబ్ధిదారులకు తప్పని తిప్పలు
- సాంకేతిక సమస్యలతో తలలు పట్టుకుంటున్న డీలర్లు
- జిల్లాలో పంపిణీ కానున్న 6,900 టన్నుల సన్నబియ్యం

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వానలు, వరదలు రానున్న వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రేషన్‌కార్డు లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలోని 1,25,589 రేషన్‌కార్డులకు సంబంధించిన 3,65,010 మంది లబ్ధిదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు చెందిన 6,900టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. మరోవైపు మూడు నెలలకు చెందిన రేషన్‌ను ఒక్కసారిగా లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో అటు లబ్ధిదారులు, ఇటు రేషన్ డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపుల వద్ద పడిగాపులుతో లబ్ధిదారులు, సాంకేతిక సమస్యలతో డీలర్లకు తిప్పలు తప్పడం లేదు. మారుమూల తండాల వాసులు , గ్రామ ప్రజలు మూడు నెలల రేషన్ బియ్యం కోసం సద్దులు కట్టుకొని రావాల్సిన పరిస్థితి ఉంది.

మండలాల వారీగా రేషన్‌కార్డు లబ్ధిదారుల వివరాలు

మండలం	మొత్తం రేషన్‌కార్డులు	రేషన్‌కార్డు లబ్ధిదారులు
భూపాలపల్లి	20,992	62,341
చిట్యాల	11,405	33,338
గణపురం	11,645	33,978
కాటారం	1,1742	33,813
పలిమెల	2,578	7,639
మహాముత్తారం	8,475	25,295
మహాదేవ్‌పూర్	10,068	28,815
మల్హర్‌రావు	9,061	25,494
మొగుళ్లపల్లి	11,690	33,001
టేకుమట్ల	8,560	24,288
రేగొండ	19,373	57,008

జిల్లాలో 3,65,010 మంది లబ్ధిదారులు

జిల్లాలో మొత్తం 1,25,589 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో మొత్తం 3,65,010 మంది లబ్ధిదారులు ఉన్నారు. రేషన్ లబ్ధిదారులకు ప్రతి నెల 2,300 టన్నుల సన్నబియ్యంను 277 రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. చిట్యాల పాయింట్ నుంచి చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల, గణపురం, భూపాలపల్లి మండలాలకు, మహాదేవ్‌పూర్ పాయింట్ నుంచి మహాదేవ్‌పూర్, మల్హార్‌రావు, పలిమెల, కాటారం, మహాముత్తారం మండలాలకు చెందిన రేషన్ షాపులకు రేషన్ బియ్యంను పంపిణీ చేస్తారు.

పడిగాపులు... తిప్పలు

జూన్,జూలై, ఆగస్టు నెలలకు చెందిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంలో అటు లబ్ధిదారులకు, ఇటు రేషన్‌డీలర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర, రాష్ట్రాలకు చెందిన కోటాను పంపిణీ చేసే క్రమంలో మూడు నెలలకు సంబంధించి లబ్ధిదారులు ఆరుసార్లు వేలి ముద్రాలు వేసే క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తుం డడంతో లబ్ధిదారులు బారులు తీరుతుండడంతో లబ్ధిదారులు, రేషన్ డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం(సన్నబియ్యం)లో 5 కిలోలు, సెంట్రల్ కోటా కింద ఒక కిలో రాష్ట్ర కోటా కింద పంపిణీ చేస్తున్నారు. సెంట్రల్, స్టేట్ కోటాలకు వేరువేరుగా లబ్ధిదారుల వేలిముద్రాలు తీసుకునే సమయంలో కొన్ని చోట్ల సిగ్నల్ సమస్యలతో ఈపాస్ యంత్రాలు మొరయిస్తున్నారు. దీంతో లబ్ధిదారు లు, డీలర్లు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో జిల్లాలో కొన్ని చో ట్ల రోజుకు 10 కార్డుల చొప్పున మాత్రమే బియ్యం పంపిణీ జరుగుతుంది. ఇదే జరిగిదే వచ్చే నెలఖారు వరకు బియ్యం పంపిణీ జరుగుతునే ఉంటుంది.

డీలర్ల చేతివాటం

ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్న సందర్భంలో

మిగతా 8వ పేజీలో...

మూడు నుంచి ఆరు సార్లు వేలి ముద్ర



కాటారంలో రేషన్‌షాపు వద్ద సాంకేతిక సమస్యలతో గంటల తరబడి వేచి ఉన్న ప్రజలు

కాటారం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణం నుంచి బియ్యం తీసుకోవడానికి వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచిచూసే పరిస్థితి తలెత్తుతోంది. మండలవ్యాప్తంగా 28రేషన్ షాపులుండగా 12వేలకు పైగా రేషన్‌కార్డులున్నాయి. నిత్యం సిగ్నల్ సరిగా రాకపోవడంతో ప్రజలు రేషన్ షాపుల వద్ద పడిగాపులు పడే పరిస్థితి తలెత్తింది. అంతేగాక రేషన్ బియ్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తుండడంతో ప్రతీ రేషన్‌కార్డుదారుడు మూడు నెలల బియ్యం పొందడం కోసం ఈ-పాస్ యంత్రంలో 3 నుంచి 6 సార్లు వేలిముద్ర వేయాల్సి వస్తున్నది. ఓ వైపు ఈ-పాస్ యంత్రాలకు సిగ్నల్ సరిగా రాకపోవడం, రేషన్‌కార్డుదారులు పలుమార్లు వేలి ముద్ర వేయాల్సి రావడంతో ప్రజలకు చాలా ఆలస్యం అవుతోంది. శుక్రవారం ప్రతి రేషన్ షాపు వద్ద ప్రజలు గంటలతరబడి వేచిచూశారు.

వన మహోత్సవాన్ని జయప్రదం చేయాలి

- ములుగు కలెక్టర్ దివాకర



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్‌రావులతో కలిసి అటవీ, డీఆర్‌డీవో, నీటిపారుదల, వ్యవసాయం, హార్టికల్చర్, జిల్లా విద్య, మునిసిపల్, పట్టణ అభివృద్ధి అధికారులు, పోలీసులు, పశుసంవర్ధక, ఆరోగ్యం, వైద్యం, కుటుంబం, విద్యుత్, గిరిజన సంక్షేమం, ఐటీడీఏ అధికారులతో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ అటవీ, నీటి పారుదలశాఖల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథ కం ద్వారా పట్టణ ప్రాంతాల్లో మునిసిపల్ ద్వారా కార్యక్రమాన్ని చేపట్టా లన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో దానిమ్మ, బొప్పాయి,నిమ్మ వంటి పండ్లు, ఇతర ఉపయోగకరమైన మొక్కలు నాటాలన్నారు. రోడ్ల వెంట అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రావి,మర్రి, పూలు, పండ్ల మొక్కలు నాటేందుకు ప్రాధాన్యతనిస్తూ భూముల సంబంధిత శాఖల సమన్వయంతో ప్రయోజకరమైన మొక్కలు నాటాలన్నారు. అటవీ, ఇతరశాఖల అధికారుల సమన్వయంతో గ్రామపంచాయతీలవారీగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేసి పరిరక్షించేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య



నిఖిత(ఫైల్)

మంగపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం మండంలోని కమలాపురం రామాలయం వీధిలో చోటు చేసుకుతంది. ఎస్సై సూరి తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం గ్రామానికి చెందిన అల్లం రమేష్-తిరుపతమ్మ దంపతుల కుమార్తె అల్లం నిఖిత(15) ఈ సంవత్సరం మార్చిలో జరిగిన 10వ తరగతి కమలాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివింది. గ్రేడ్ 1 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. తల్లి తిరుపతమ్మ ఆర్ఎంసీ చర్చిలో కూలి పనికి రోజువారి మాదిరిగా శుక్రవారం ఉదయం వెళ్లింది. చర్చికి పోయి ఇంటికి తిరిగి వచ్చి చూడగా కుమార్తె ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం చూసి విలపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్సై సూరి సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఇంట్లో వెతకగా నిఖిత రాసిన లెటర్ లభ్యమైంది. తల్లి తిరుతపమ్మ మందలించడంతోనే మనస్తాపం చెంది నిఖిత ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తెలిపారు. తల్లి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సామాజిక వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్ కార్యాలయం.. వెలవెల

అధికారులు, సిబ్బంది అందుబాటులో లేక సర్టిఫికెట్ల కోసం ఎదురుచూపులు



నిర్మానుష్యంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం

కాటారం, జూన్ 6(ఆంధ్రజ్యోతి):భూ భారతి రెవెన్యూ చట్టం అమలులో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో సదస్సులు నిర్వహిస్తుండడంతో తహసీల్దార్ కార్యాలయం బోసి పోతోంది. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించడం, తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, ఆర్ఐ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు సదస్సులకు హాజరవుతుండడంతో కార్యాలయంలో ఒకరిద్దరు ఆఫీస్ సబార్డినేట్లు, వీఆర్ఏలు తప్ప ఎవరూ అందుబాటులో లేక కార్యాలయంలో సందడి కానరావడం లేదు. కాగా రైతులు, ప్రజల సమస్యల కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు అధికారులు, సిబ్బంది హాజరవుతుండగా విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే రోజులు దగ్గరపడుతుండడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకుని ఎదురుచూస్తున్నారు. సదస్సులతో పాటు కార్యాలయంలోని దరఖాస్తులను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఉద్యాన పంటల సాగుపై మక్కువ చూపాలి

- అవగాహన సదస్సులో జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు

ములుగు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు ఉద్యాన పంటల సాగుపై మక్కువ చూపుతూ ఆశించినస్థాయిలో ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు అన్నారు. ములుగు మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వివిధ రకాల పండ్లు, కూరగాయల పంటలు సాగు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఇందిర సౌరగిరి జల వికాస పథకం కింద ఆయిల్‌పామ్, వివిధ రకాల పండ్లతోటలను రాయితీపై సాగు చేయవచ్చునని అన్నారు. సమీకృత ఉద్యాన అభివృద్ధిమిషన్‌లో భాగంగా రైతులు రాయితీపై వివిధ రకాల పండ్లతోటలు, కూరగాయలు సాగుచేసుకోవచ్చని, 50శాతం రాయితీపై మల్చింగ్ రాయితీ ఉంటుందని, పందిరి కూరగాయల సాగు చేసుకోవచ్చని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ఎకరాకు రూ.1140 మొక్కకు రూ.20ల చొప్పున చెల్లించి నట్లయితే 57 మొక్కలు ఇవ్వడం జరుగుతుందని, నాలుగో సంవత్సరం వరకు ఎకరాకు రూ.4200, అంతర పంటల సాగు యాజమాన్యం కింద అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వివిధ రకాల పండ్లు, పూలు, కూరగా యలు, పత్తి సాగుచేసే రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. బిందుసేద్య పరికరాలు చిన్న, సన్నకారు రైతులకు ఐదెకరాల్లోపు రైతులకు 90 శాతం రాయితీ, ఐదెకరాలపైన రైతులకు 80శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీ ఉంటుందని అన్నారు. సదస్సులో ములుగు డివిజన్ ఉద్యానఅధికారి శ్రీకాంత్, విస్తరణాధికారి రమేష్, కేఎన్ బయోసైన్స్ ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు హేమంత్‌రెడ్డి, నవీన్‌నాయక్, జగదీశ్, పరీక్షిత్, డ్రిప్ కంపెనీ ప్రతినిధి దేవేందర్‌రెడ్డి, రైతులు వీరయ్య, కనకయ్య, రామయ్య, సాంబాయమ్మ, మాణిక్యం, మంగ, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువులన్నీ మట్టిదిబ్బల పాలు

సింగరేణి ఓసీలతో నీటి వనరుల ధ్వంసం

7లో

సొంతింటి కల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ పేదవాడి సొంతింటి కల నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. అలాగే లబ్ధిదారులకు హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాలపై పెట్టిన శ్రద్ధ పేదవాడి ఇళ్లపై పెట్టలేదని అన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం రూ.22వేల 500కోట్లు పేదోళ్ల ఇండ్లకు ఖర్చుచేస్తుందని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ఎజెండాగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

ఈ సారైనా.. చక్కబడేనా..!?



కాటారంలో పిల్లర్లకే పరిమితమైన పీఎస్ భవనం

- ఇంకా పూర్తికాని అభివృద్ధి పనులు
- 34 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్
- 24 బడుల్లో ఉపాధ్యాయులే లేరు.
- ప్రారంభానికి ఇంకా ఐదు రోజులే..



భూపాలపల్లిలో నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

భూపాలపల్లిటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతంమాట దేవుడెరుగు కానీ.. ఉన్న పాఠశాలలను కాపాడుకునే పరిస్థితి లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అది ఉపాధ్యాయుల లోపమా..? ఆ గ్రామ ప్రజల లోపమా..? లేక ప్రభుత్వాలు తీసుకుంటున్న నామమాత్రపు చర్యలా..? అనేది చర్చనీయాంశంగా మారింది. ప్రతి విద్యా సంవత్సరం రెండు మూడు పాఠశాలలు మూతపడుతూనే ఉన్నాయి. కొన్నింటిలో అసలు పిల్లలే లేరు. బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్నా.. దాని ఫలితం అంతంత మాత్రంగానే ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రతీఏటా నిధులు మంజూరుచేస్తున్నా.. వాటిలో సౌకర్యాల లేమీ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాఠశాలలు ప్రారంభం కావడానికి ఐదు రోజులే ఉండగా బడులు ఈసారైనా.. చక్కబడుతాయా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిస్థితి ..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జడ్పీహెచ్ఎస్‌లు 69, ప్రాథ మిక పాఠశాలలు 319, ప్రాథమికోన్నత పాఠశాలలు 44 ఉన్నాయి. మొత్తంగా వీటిలో 1570 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంకా 233 మంది ఉపాధ్యాయులు భర్తీ కావాల్సి ఉంది. జిల్లాలోని 34 పాఠశాలల్లో ఈసారి జీరో ఎన్‌రోల్‌మెంట్ అయ్యింది. వీటిలో 8 పాఠశాలల్లో మాత్రమే 8 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం వారు బడిబాట కార్యక్రమంలో పిల్లలను చేర్పించకపోతే వారిని మరోచోటికి పంపే పరిస్థితి లేకపోలేదు.

ఇలా అయితే.. చదువులెట్లా..?

జిల్లాలోని పలు పాఠ శాలల్లో ఇంకా దీన స్థితి కనిపిస్తోంది. నిధులు మంజూరైనా వాటిని చక్కదిద్దే నాథులే లేకుండా పోయారు. జిల్లాలోని కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 25 మంది విద్యార్థులు ఉన్నారు. దీనికి సుమారు రూ.28లక్షలు నిధులు మన ఊరు మన బడి కింద మంజూరయ్యాయి. కానీ ఇంకా పనులు పూర్తి కాలేదు. ఇదిలా ఉంచితే.. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో కూడా దీనికి మోక్షం లభించలేదు. దీంతో ఈ పాఠ శాల పనులు పిల్లర్లకు మాత్రమే పరిమితమైంది. ఈ క్రమంలో చేసేదేమీ లేక ఆ పాఠశాలను శిథిలావస్థలో ఉన్న ఓ గూన ఇంట్లో నడిపిస్తున్నారు. అదీ కూడా భయాందోళనతో. అలాగే టేకుమట్ల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో 72 మంది పిల్లలుంటారు. ఐదుగురు ఉపాధ్యాయులున్నారు. కానీ ఈ భవనాన్ని పదేళ్లుగా నిర్మించలేదు. ప్రస్తుతం ఈ పాఠశాల సమీపంలోని జడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతుంది. భూపాలపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్, పీఎస్‌లకు మరుగుదొడ్లు ఉన్నాయి. కానీ నీటి సౌకర్యం లేదు. వాటిని క్లీనింగ్ చేసేనాథులే లేకపోవడంతో వాటి నిర్వహణ జరగడం లేదు. కానీ ఇక్కడ సుమారు 300లకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నా..వారికి మరుగదొడ్లు, మంచినీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ప్రతి మండలంలో ఏదో ఒక పాఠశాల రకరకాల అసౌకర్యాలతో దర్శనమిస్తాయి.



కాటారంలో శిథిలావస్థలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాల

అభివృద్ధి ఎక్కడ ?

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు గాను గత ప్రభుత్వం మన ఊరు.. మన బడి.. కింద జిల్లాకు రూ.22 కోట్లు మంజూరు కాగా 149 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. కానీ 51 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. వాటికి సంబంధించిన నిధులు రూ.3కోట్లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నట్లు అధికారుల చెబుతున్నారు. ఇంకా మిగతా పాఠశాలల్లో 70 నుంచి 80శాతం పనులు పూర్తయినట్లు చెబుతున్నారు. అలాగే

మిగతా 8వ పేజీలో...



మడికొండ ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించాలి

పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె. సత్యనారాయణరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బడిబాట కార్యక్రమం వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైంది. శుక్రవారం కాజీపేటలోని మడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కలెక్టర్ డాక్టర్ సత్యశారద బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండు జిల్లాల్లో మండల కేంద్రాల్లో ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భద్రకాళి మాడవీధుల పనుల పరిశీలన



మాడవీధులను పరిశీలిస్తున్న కమిషనర్, కుడా చైర్మన్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి మాడవీధులకు సంబంధించిన పనులను వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిలు శుక్రవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిలో దొరికిన మాజీ కౌన్సిలర్లు

పట్టించిన భార్య.. ఇద్దరికి దేహశుద్ధి ● మానుకోటలో చర్చనీయాంశం

మహబూబాబాద్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు మాజీ కౌన్సిలర్ల రాసలీలలు బట్టబయలయ్యాయి. పట్టణంలో వీరు ఓ లాడ్జిలో పట్టుబడ్డారు. వీరిని మాజీ కౌన్సిలర్ భార్య పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. మానుకోట పట్టణంలోని ఓ ప్రముఖ లాడ్జి గదిలో ఇద్దరు ఉన్నట్లు పక్కా సమాచారంలో మాజీ కౌన్సిలర్ భార్య తన బంధువులతో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం 100కు సమాచారం అందించగా పోలీసులు వచ్చి వారి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పట్టుబడ్డ మహిళ షీటీంలో సభ్యురాలిగా పనిచేస్తున్నట్లు తెలిసింది.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

హనుమకొండటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈనెల 24న నిర్వహించే ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు బీసీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్రరవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరవుతున్నారని చెప్పారు.

జోరుగా దరఖాస్తుల వెల్లువ

● రెవెన్యూ సదస్సులకు భారీ సంఖ్యలో రైతులు హాజరు ● ధరణిలో దొర్లిన తప్పులపైనే ఎక్కువ ఫిర్యాదులు

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నాలుగు రోజులుగా జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు పలు సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తున్నారు. గతంలో ఇదే సమస్యలపై తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల్లో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ పరిష్కారం కాలేదని, కనీసం ఇప్పుడైనా పరిష్కారమైన తమకు న్యాయం జరుగుతుందా? అని అడుగుతున్నారు. సదస్సుల్లో పలువురు రైతులు కొత్త పాస్‌పుస్తకాల్లో భూ విస్తీర్ణంలో తప్పులు, సాదాబైనామాలపై దరఖాస్తులు చేసుకుంటున్నారు. లంచాలు తీసుకొని, ఒకరి భూమిని మరొకరి పేరిట పట్టా చేయడం, భూమి లేకపోయినా పాస్ పుస్తకాలు ఇవ్వడం, భూమి ఉన్నా పాస్ పుస్తకాలు జారీ చేయకపోవడం వంటి అనేక తప్పులపై కూడా ఎక్కువగా దరఖాస్తులు దాఖలవుతున్నాయి. పౌతి కేసులు, సర్వే నెంబర్ మిస్సింగ్‌లు, డిజిటల్ సైన్ పెండింగ్ వంటి సమస్యలపై కూడా రైతులు ఎక్కువగా పిటిషన్లను దాఖలు చేస్తున్నారు. దీంతోపాటు రెవెన్యూ, ఫారెస్టు శాఖల మధ్య వివాదాస్పదంగా ఉండడం వల్ల పట్టాలు రాని రైతులు సైతం ఆ విషయాన్ని అధికారులు దృష్టికి పిటిషన్ల రూపంలో తీసుకువస్తున్నారు. సదస్సుల్లో దాఖలైన పిటిషన్లలో పెండింగ్ మ్యుటేషన్లు, సక్సెషన్ విస్తీర్ణంలో తప్పులకు సంబంధించినవి కూడా ఉంటున్నాయి. లావణి పట్టాభూములు, బాగా పంపిణీ సమస్యలపై కూడా పిటిషన్లు అందుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో సిబ్బంది నిర్లక్ష్యం, అధికారులు లాలూచీ వల్ల ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులపైన అధికంగా ఫిర్యాదులు దాఖలవుతున్నాయి. ధరణి పోర్టల్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు పలు సూచనలు చేస్తున్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గత ప్రభుత్వాలు బంచరాయి ఇనాం భూములు ఇచ్చాయని, వాటికి పట్టాలు ఇప్పించి, బ్యాంకు రుణాలు తీసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఆ భూములను వారసత్వంగా వచ్చేలా చట్టంలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు రైతులు తమ గ్రామాల్లో కబ్జాకు గురైన చెరువులు, ప్రభుత్వ భూముల వివరాలను అధికారుల బృందం దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకువస్తున్నారు. ఈ భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడాలని కోరుతున్నారు. ఆ వివరాలను ఇచ్చిన తమ పేర్లను గోప్యంగా ఉంచాలని కోరుతున్నారు. సాదాబైనామాలపై దరఖాస్తులు చేసుకున్న రైతులకు అధికారులు ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందువల్ల ఈ విషయంలో తామేమి చేయలేమని అధికారులు రైతులకు స్పష్టం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై పరిష్కారం ఉంటుందని చెబుతున్నారు.



రాయపర్తి మండలం గట్టికల్ గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నాలుగో రోజు

భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులు నాలుగో రోజు శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో జోరుగసాగాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన సమస్యలను పేర్కొంటూ దరఖాస్తులను సమర్పించారు. తహసీల్దార్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వీటిని స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో రికార్డు చేశాయి. హనుమకొండ జిల్లాలోని 13 మండలాల్లోని 13 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం 1890 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ నాలుగు రోజుల్లో సదస్సుల్లో దాఖలైన మొత్తం దరఖాస్తుల సంఖ్య 5,607కు చేరుకున్నది. కాగా, వరంగల్ జిల్లాలో 13 మండలాలకుగాను పన్నెండింటిలో 24 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లాలో నాలుగోరోజు శుక్రవారం రెవెన్యూ సదస్సులు భీమదేవరపల్లి మండలంలో కొత్తకొండ, ధర్మసాగర్ మండలంలో క్యాతంపల్లి, ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్‌పేట, హనుమకొండ మండలంలో పలివేల్పుల, ఐనవోలు మండలంలో వెంకటాపూర్, కమలాపూర్ మండలంలో గుండేడు, వేలేరు మండలంలో పీచర, కాజీపేట మండలంలో మడికొండ, హసన్‌పర్తి మండలంలో చింతగట్టు, దామెర మండలంలో కోగిల్వాయి, ఆత్మకూరు మండలంలో చౌళ్లపల్లి, పరకాల మండలంలో పైడిపెల్లి, శాయంపేట మండలంలో కాట్రపల్లిలో జరిగాయి.

వరంగల్ జిల్లా

రాయపర్తి మండలంలో గట్టికల్, ఊకల్, పర్వతగిరి మండలంలో అన్నారం షరీఫ్, ఖిలా వరంగల్ మండలంలో స్తంభంపల్లి, గాడెపల్లి, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో రామచంద్రాపూర్, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో అమీనాబాద్, ఎల్లయ్యగూడెం, దుగ్గొండి మండలంలో నాచినపల్లి, పొనకల్, నర్సంపేట మండలంలో నర్సంపేట, ముగ్దుంపురం, నల్లబెల్లి మండలంలో గోవిందాపూర్, రేలకుంట, గీసుకొండ మండలంలో వంచనగిరి, ఊకల్ హవేలి, నెక్కొండ మండలంలో ముదిగొండ, తోపనపల్లి, ఖానాపూర్ మండలంలో డబీర్‌పేట, మంగళవారిపేట గ్రామాల్లో సదస్సులు జరిగాయి. శనివారం బక్రీద్, ఆదివారం సెలవు అయినందు వల్ల 7,8 తేదీల్లో రెవెన్యూ సదస్సులు ఉండవు.

బాలుడి కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

వరంగల్ క్రైం, జూన్ 06 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్‌కు గురైన 3 ఏళ్ల బాలుడి ఆచూకీ కనిపెట్టి తల్లితండ్రులకు అప్పగించినట్లు హనుకొండ ఇన్స్‌పెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యాదవనగర్‌కు చెందిన రుద్రవేణి నరేశ్, జ్యోతి దంపతుల 3 ఏళ్ల బాబు ఆడుకుంటా కనిపించకుండా పోయాడని బాలుడి తల్లితండ్రులు ఫిర్యాదు చేశారు. గాలింపు చేపట్టగా భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మంథనికి చెందిన బాలుడి మేనమామ తాండ్ర ప్రశాంత్ కుటుంబ ఘర్షణల మధ్య కిడ్నాప్ చేశాడని తెలియడంతో ఆదుపులోకి తీసుకొని తల్లితండ్రులకు అప్పగించామన్నారు.



బాలుడిని తల్లితండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి

దుగ్గొండి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలోని తిమ్మంపేటలో శుక్రవారం తెల్లవారుజా మున చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తిమ్మంపేటకు చెందిన దండు అన్వర్, హేమలత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దండు వంశీతరుణ్(22) వరంగల్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు, పేద కుటుంబం కావడంతో వంశీతరుణ్ వరంగల్‌లోని ఓ హోటల్‌లో పార్టుటైం పనిచేస్తూ చదువుకుంటున్నాడు. సంగెం మండలంలోని తిమ్మాపూర్‌లో శుభకార్యం ఉండగా ద్విచక్రవాహనంపై వెళ్లివస్తున్న క్రమంలో మామునూరు క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారు జాము న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వంశీతరుణ్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మామునూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఉన్నత చదువు కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో వంశీతరుణ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదం చెలకొంది. వంశీతరుణ్ మృతికి మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, మండల అధ్యక్షుడు ఒరంగటి తిరుపతిలు సంతాపం తెలిపి నివాళులర్పించారు.



వంశీతరుణ్

9 నుంచి డీసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డీసెట్-2025లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 9 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని ఆయన తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 64 మంది ఎంపిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నిర్వహించిన నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో జిల్లాకు చెందిన 64 మంది ఎంపికైనట్లు ఇన్‌చార్జి డీఈవో మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 628 మంది పరీక్షకు హాజరుకాగా అందులో 64 మంది ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఎంపికైన విద్యార్థులకు సాలీనా రూ.12వేలు సదరు విద్యార్థికి ఇప్పటి నుంచి ఇంటర్మీడియెట్ రెండేళ్ల పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

ప్రముఖుల పేర్లతో సైబర్ మోసం

● డబ్బులున్నాయి.. ఫోన్ పే చేయండని వల ● మోసపోతున్న అమాయకులు ● ఏటూరునాగారం ప్రాంతంలో సరికొత్త దందా

ఏటూరునాగారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల కొత్త మోసాలకు పాల్పడుతూ వ్యాపారులు, ప్రముఖ వైద్యులను ఆందోళనకు గురిచేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల చేస్తున్న ఫోన్ కాల్స్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. స్థానికంగా పేరున్న వైద్యుల పేరు చెప్పి, అత్యవసరంగా డబ్బులు కావాలంటూ.. నీకు క్యాష్ ఇస్తా.. నాకు ఫోన్‌పే చేస్తావా.. అంటూ ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు వారి అకౌంట్‌లోకి బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా శుక్రవారం మండల కేంద్రంలోని ఆరాధ్య హాస్పిటల్ డాక్టర్ పేరుతో, ఆస్పత్రి పక్కనే ఉన్న ఓ గ్రాఫిక్స్ సెంటర్ యజమానికి సైబర్ నేరగాళ్ల నుంచి కాల్ వచ్చింది. 'హలో, నేను ఫలానా వైద్యశాల నుంచి కాల్ చేస్తున్నాను. నీకు క్యాష్ ఇస్తాను.. నాకు మూడు వేలు ఫోన్‌పే చేయండి..' ఇలాంటి మాటలతో సైబర్ నేరగాళ్లు వ్యాపారులకు కాల్స్ చేస్తున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో రెండు, మూడు రోజులుగా ఇలాంటి కాల్స్ చేసి సైబర్ నేరగాళ్ల డబ్బులు వసూలు చేస్తున్న సంఘటనలు కలకలం రేపుతున్నాయి.

మూడు రోజుల కిందట..

మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాల డాక్టర్ పేరు చెప్పి సైబర్‌నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఓ జువెలరీ షాప్‌కు చెందిన మహిళకు కాల్ వచ్చింది. 'మా దగ్గర నగదు ఉంది.. ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించండి' అని సైబర్ నేరగాళ్లు ఆ మహిళను కోరారు. ఎదురుగా ఉన్న వైద్యశాల డాక్టర్ ఫోన్ చేసినప్పుడు డబ్బులు పంపించకుంటే ఏమనుకుంటాడోనని భావించిన ఆ మహిళ.. వెంటనే ఫోన్‌పే ద్వారా వారు చెప్పిన నంబరుకు డబ్బులు పంపించింది. కొద్దిసేపు వేచి చూసిన తర్వాత, సదరు డాక్టర్ నంబర్‌కు ఆ మహిళ తిరిగి కాల్ చేసింది. అయితే, తాను కాల్ చేయలేదని, ఎవరు చేశారో తెలియదని డాక్టర్ సమాధానం ఇచ్చాడు. దీంతో ఆ మహిళ ఖంగుతింది. అంతేకాకుండా, తాను డబ్బులు పంపిన ఫోన్‌పే నంబర్ కూడా తమది కాదని డాక్టర్ చెప్పడంతో, తాను మోసపోయినట్లు ఆ మహిళ గుర్తించింది. వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు చేస్తున్న ఈ కొత్తరకం మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

మోదీ విధానాలతో తీవ్ర ఆర్థిక అసమానతలు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

హనుమకొండ చౌరస్తా, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ విధానాలతో సమాజంలో తీవ్ర ఆర్థిక అసమానతలు ఏర్పడుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో కార్మికవర్గంపై దాడి జరుగుతోందన్నారు. దానిని ప్రతిఘటించేందుకు జూలై 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక లోకం పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయని, కొందరి చేతుల్లోనే సంపద కేంద్రీకరణ కావడంతో, దేశంలో సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రేలాపనలు, టారీఫ్‌ల పెంపులు కూడా పెట్టబడిదారీ విధాన సంక్షోభంలో భాగమేనన్నారు. ఇతర దేశాల సరుకులపై పన్నుల భారం మోపడం ద్వారా తన సంక్షోభాన్ని తప్పించుకునే పనిలో అమెరికా ఉందని తెలిపారు. 30, 40 ఏళ్లుగా అమెరికా ఉత్పత్తి ప్రక్రియను ఆపేసి చౌకగా కార్మిక శక్తి దొరికే ప్రాంతాలకు మళ్లించిన తీరును వెంకటేష్ వివరించారు. మోదీ సర్కారు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గంపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. పహల్గామ్ ఉగ్ర ఘటన నేపథ్యంలో సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేయాలని అన్ని కార్మిక సంఘాలు సమష్టి నిర్ణయం తీసుకున్నాయని వెంకటేష్ తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ.. గుజరాత్ రాష్ట్రంలో కార్మికవర్గంపై దాడి దుర్మార్గమన్నారు. కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని బేఖాతరు చేస్తూ రాత్రి షిఫ్టులోనూ మహిళలను పని చేయాలని ఆదేశాలు జారీచేయడం సరికాదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్లు జి.ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పుల్ల అశోక్, బి.మహేష్, కొలిపాక, జిల్లా కమిటీ సభ్యులు యాకయ్య, యాకూబ్ బాబు, మండల శ్రీనివాస్, కల్పన, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు

కాజీపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగించినందుకు పలువురిపై ఆర్పీఎఫ్ సిబ్బంది కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేట్ మూసి ఉన్నా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి తనయుడు ప్రశాంత్ అతడి బృందం రైల్వే గేట్ తెరవాలని గేటు ముందు ఆందోళనకు దిగారు. దీంతో రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఆ 14మందిపై ఆర్పీఎఫ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు సిరికొండ ప్రశాంత్, తాటి జనార్దన్, గురుకుంట్ల కిరణ్, ఎర్లరాజు, కంచెర్ల ప్రకాశ్, శశికాంత్ గౌడ్, బియాని పూర్ణను అరెస్ట్ చేసి వారి పూచికత్తుపై వదిలిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

పట్టాలు దాటిన వారిపై కేసు

రైల్వే నిషేధిత ప్రాంతం వద్ద పట్టాలు దాటిన 10 మందిపై ఆర్పీఎఫ్ సిబ్బంది కేసులు నమోదు చేశారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్ మధ్య శుక్రవారం రైల్వే గేటు మీదుగా రైలు పట్టాలు దాటిన 10 మంది పాదచారులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వారిని రైల్వే కోర్టుకు హాజరుపర్చనున్నట్లు తెలిపారు. రైళ్లపై రాళ్లు విసిరినా, రైలు పట్టాలపై రాళ్లు పెట్టినా చర్యలు తప్పవన్నారు. అనంతరం రైల్వే గేట్ వద్ద పాదచారులకు అవగాహన కల్పించారు. అనంతరం పెండ్యాల- కాజీపేట మధ్య నడిచే రైళ్లకు బందోబస్త్ నిర్వహించారు.



బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ సీ చటర్జీ



వరంగల్ రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆయకార్ భవన్

ఆపదలో 'ఆదాయ శాఖ'

● శిథిలావస్థకు చేరిన ఇన్‌కామ్‌టాక్స్ భవనం
● నైజాం కాలంలో నిర్మాణం
● నూతన భవనం నిర్మించాలంటున్న ప్రజలు

వరంగల్ చౌరస్తా, జూన్6 (ఆంధ్రజ్యోతి): నైజాం కాలంలో వరంగల్‌లో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల్లో 'ఆయకర్ భవనం ఒకటి. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇందులోనే ఆదాయపు పన్ను శాఖ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కార్యాలయం ఇదే. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలపై చెట్లు మొలిచి వృక్షాలవుతున్నాయి. దీని స్థానంలో నూతన భవన నిర్మాణం కోసం కొన్నేళ్లక్రితమే ప్రతిపాదనలుపంపగా కేంద్ర ఆదాయపు పన్ను శాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిధులు కూడా కేటాయించినట్లు సమాచారం. ఈకార్యాలయం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉండడంతో ఇక్కడ నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. జన సముద్రం ఎక్కువగా ఉంటుంది. ప్రమాదం జరగక ముందే పాలకులు స్పందించి పాత భవనాన్ని తొలగించాలని, నూతన నిర్మాణం చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

చెరువులన్నీ మట్టిదిబ్బల పాలు

సింగరేణి ఓసీలతో నీటి వనరుల ధ్వంసం

- ఇరిగేషన్ శాఖకు పరిహారం చెల్లించకుండానే చెరువుల ఆక్రమణ
- మట్టి కుప్పలు పోసిన చెరువుల్లో మిషన్ కాకతీయకు రూ. కోట్ల ఖర్చు
- భూపాలపల్లిలోని ఓపెన్‌కాస్ట్-3 పరిధిలో ఇష్టారాజ్యం


నగరంపల్లి శివారులోని రాజమ్మకుంటలో పోసిన ఓసీ-3 మట్టి కుప్పలు

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బొగ్గు తవ్వకాల పేరుతో సింగరేణి అధికారులు నీటి వనరులను ఛిద్రం చేస్తున్నారు. బొగ్గు తవ్వకాల పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలను అక్రమంగా వాడకుంటు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్ట్-3 పరిధి బయట ఉన్న జలవనరులను సింగరేణి ధ్వంసం చేస్తోంది. ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, పరిహారం చెల్లించకుండా మట్టిదిబ్బలతో కుంటలను నింపేస్తున్నారు. ఓసీ- 3 పరిధిలోని గణపురం మండలం నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట,మాదిగకుంట,సుద్దకుంటలను మట్టితో నింపేశారు. ఈ కుంటలకు చెందిన దాదాపు 45 ఎకరాల భూముల్లో మట్టి పోశారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నా సంస్థ తన పద్ధతిని మార్చుకోవడం లేదు. ఒక వైపు ఓసీ(ఓపెన్ కాస్ట్)లతో భూగర్భ జలాలు అడుగుంటుతుండగా, మరోవైపు తవ్వకాల పరిధి బయట ఉన్న నీటి వనరులను ధ్వంసం చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఓసీ-3ని ఇప్పటికే ఏర్పాటుచేసి తవ్వకాలు చేస్తున్న సింగరేణి... తవ్విన మట్టిని పక్కనున్న చెరువుల్లో, కుంటల్లో డంప్ చేస్తోంది. తద్వారా నీటి వనరులు ధ్వంసం కావడంతో పాటు పర్యావరణంకు నష్టం జరుగుతోంది. ఓసీ-3 తవ్వకాలకు 3,201 ఎకరాలను భూసేకరణ చేయాలని నిర్ణయించిన సింగరేణి చాలా వరకు భూసేకరణ చేపట్టి పనులు ప్రారంభించింది. ఓసీ-3 పేరిట ఇప్పటికే చాలా చెరువులు, కుంటలను మింగిన సింగరేణి తన పరిధిలో లేని నీటి వనరులను ఇప్పుడు ధ్వంసం చేయడం ప్రారంభించింది.

మిషన్ కాకతీయతో రూ. కోట్లల్లో పనులు

ఓసీ-3 పేరిట సింగరేణి మట్టి కుప్పలుగా మార్చిన గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటల అభివృద్ధికి నీటిపారుదల శాఖ అధికారులు రూ. కోట్లు ఖర్చు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ మూడు కుంటల అభివృద్ధికి రూ. కోటికిపైగా వెచ్చించి, అభివృద్ధి పనులు చేయించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు ఈ కుంటల్లో స్థానిక మత్స్యకారులు చేపలు పట్టుకొని జీవనోపాధి పొందేవారు. సింగరేణి తీరుతో ప్రభుత్వానికి రూ. కోట్లల్లో నష్టం రావడంతో పాటు స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొంది.

అనుమతులు లేకుండానే

గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటలకు చెందిన సుమారు 45 ఎకరాల్లో సింగరేణి ఓసి-3 మట్టి నిల్వలను పోసింది. రాజమ్మ కుంట కింద 40 ఎకరాలు, మాదిగకుంట కింద 40 ఎకరాలు, సుద్దకుంట కింద 135 ఎకరాల ఆయకట్టు ఉంది. ఓసీ-3లో భూములు కోల్పోతున్న రైతులకు కొంత మందికి మాత్రమే పరిహారం అందగ మిగిలిన వారికి ఇప్పటికీ పరిహారం అందలేదు. ఓసీ-3 పరిధిలో లేని నీటి వనరుల్లో సింగరేణి అధికారులు వాల్టా చట్టం నిబంధనలు పక్కన పెట్టి మట్టి కుప్పలు పోశారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా, పరిహారం చెల్లించకుండా సింగరేణి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న తరుణంలో ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, కుంటల కట్టలు, తూములను పరిశీలించే క్రమంలో ఈ మూడు కుంటల్లో సింగరేణి మట్టి కుప్పలు పోసిన వ్యవహారం బహిర్గతమైంది.


నగరంపల్లి శివారులోని రాజమ్మకుంటలో పోసిన ఓసీ-3 మట్టి కుప్పలు

హైకోర్టుకు

గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటల్లో అక్రమంగా మట్టి కుప్పలు పోసిన సింగరేణి అధికారుల తీరుపై ఇరిగేషన్ శాఖ అధికారులు హైకోర్టు మెట్లెక్కెందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే సింగరేణికి లేఖ ద్వారా అభ్యంతరాలు తెలిపిన అధికారులు.. సింగరేణి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో హైకోర్టుకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. భూనిర్వాసితులకు పరిహారం చెల్లించడంతో పాటు భూములు కోల్పోతున్న ప్రభుత్వ సంస్థల భూములకు పరిహారం చెల్లించడం, మరోచోట భూమిని అభివృద్ధి చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా ఓసి-3లో మట్టి నిల్వలు పోసిన కుంటలకు కుడా సింగరేణి ఇరిగేషన్‌శాఖకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. పరిహారం చెల్లించాల్సి వస్తే మూడు కుంటలకు కలిపి రూ. 11 కోట్లు చెల్లించాలని ఇరిగేషన్ శాఖ కోరుతోంది. లేదంటే సింగరేణి ఎంత భూమి వాడుకుంటుందో అంత భూమితో మరోచోట చెరువులను తవ్వి ఇవ్వాల్సి ఉంటుందని ఇరిగేషన్‌శాఖ అధికారుల వాదన. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు సింగరేణికి చెరువుల ధ్వంసంపై లేఖ కుడా రాయడం జరిగింది. సింగరేణి ఇప్పటివరకు ఇరిగేషన్‌శాఖ లెటర్‌పై స్పందించిన దాఖలాలు లేవు. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు సింగరేణి ద్వారా కోల్పోతున్న కుంటలకు సంబంధించి న్యాయం చేయాలని హైకోర్టులో కేసు నమోదు చేసేందుకు సిద్ధం అయినట్లు సమాచారం.

అనుమతులు లేకుండానే..



అనుమతి లేకుండానే, ఎటువంటి పరిహారం చెల్లించకుండా సింగరేణి ఓసీ-3 మట్టి నిల్వలను నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటల్లో పోసింది. దీంతో కుంటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. మట్టి నిల్వలపై ఇప్పటికే సింగరేణి యంత్రాంగంకు లేఖ రాయడం జరిగింది. త్వరలోనే సింగరేణి వైఖరిపై హైకోర్టులో కేసు నమోదు చేయనున్నాం.

- బసవ ప్రసాద్, ఈఈ భూపాలపల్లి డివిజన్


కాళేశ్వరం - మహదేవపూర్ జాతీయ రహదారి ఇదే

జాతీయ రహదారి.. ప్రమాదకరంగా మారి..

- పెండింగ్‌లోనే ఉంటున్న జాతీయ రహదారి 353 సీ పనులు
- కేంద్ర అటవీశాఖ అనుమతుల కోసం ఎదురుచూపులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

మహదేవపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి అంటే రయ్ రయ్ మంటూ ఎలాంటి అడ్డంకులు.. గుంతలు.. ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయొచ్చు.. ఇక్కడ మాత్రం అలా కాదు.. జాతీయ రహదారికి భిన్నంగా 353-సీ ఉంటుంది. వాహనదారులు ఏమరపాటుగా ఉన్నారంటే అంతే సంగతులు ప్రమాదం తప్పనిసరి.. 17 కిలోమీటర్ల రహదారి వెడల్పు కోసం వంద కారణాలు అడ్డు వస్తున్నాయి. ఒక పని ముందుకు పడితే మరో పని వెనుకపడుతోంది. అనుమతులు వస్తాయని అటవీశాఖ కోసం ఎదురుచూడాల్సిన పని. సరస్వతి పుష్కరాల సమయంలో గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచినా సమస్య పరిష్కారానికి మార్గం చూపడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్- కాళేశ్వరం 353 సీ జాతీయ రహదారిలో 17 కిలోమీటర్ల మార్గం అధ్వానంగా మారింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు అయిన ఈ రహదారి మీదుగానే అంతరాష్ట్ర రాకపోకలు జరుగుతాయి. ఈ రహదారి విస్తరణకు ఏళ్లుగా ఎదురుచూపులే మిగులుతున్నాయి. 2022 నవంబరు 12న ప్రధాని మోదీ రామగుండం పర్యటనలో భాగంగా విస్తరణ పనులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేసినా అటవీశాఖ అభ్యంతరాలతో ముందడుగు పడడం లేదు. ఇటీవల జరిగిన సరస్వతి పుష్కరాలకు లక్షలాది మంది తరలిరావడంతో ఈ మార్గంలో రహదారి విస్తరణ జరగక కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామయింది. 2027లో గోదావరి పుష్కరాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో రహదారి విస్తరణ తప్పనిసరిగా మారింది.

అటవీశాఖ అడ్డంకి..

మహదేవపూర్- కాళేశ్వరం మధ్య మహారాష్ట్ర సిరొంచకు వెళ్లే మార్గంలో 17 కిలోమీటర్ల వరకు పనులు జరగడం లేదు. ఇందులో సుమారు 15 కిలోమీటర్లు అటవీశాఖ ఆధీనంలో ఉండడంతో అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో రహదారి విస్తరణ పనులు అటకెక్కాయి. ఈ మార్గంలో 109 రకాలకు చెందిన 7529 చెట్లను తీసివేయాల్సి ఉండగా వీటి విలువ సుమారు 2 కోట్లపైనే అధికారులు అంచనా వేశారు. జాతీయ రహదారి, అటవీశాఖ అధికారులు కలిసి తొలగించే వృక్షాలకు గుర్తులు వేశారు. యూజర్ ఏజన్సీ అటవీశాఖకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అనుమతులు కోసం కేంద్ర అటవీశాఖకు లేఖ పంపి సంవత్సరం దాటినా ఇంతవరు అనుమతులు రాకపోవడం గమనార్హం. మరోవైపు కాళేశ్వరం నుంచి కన్నెపల్లి మూలమలుపు వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు నిర్మాణం చేయాల్సి ఉండగా రైతులు భూములు ఇవ్వడం లేదు. దీంతో ఈ పనులు అలాగే మిగిలిపోయాయి.

అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం..

మహదేవపూర్, కాళేశ్వరం జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంటుంది. ఇప్పటికే నివేదికలు పంపాం. అనుమతులు రాగానే టెండర్లు వేసి పనులు ప్రారంభిస్తాం.

- మనోహర్, ఈఈ, జాతీయ రహదారులు

కేయూలో ఉద్రిక్తత

- పౌరహక్కుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు
- తీవ్ర నిరసన తెలిపిన ప్రజాసంఘాల నేతలు
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి: పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

కేయూ క్యాంపస్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ నేతృత్వంలో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఉదయం 10గంటలకు ఫార్మసీ కళాశాల వద్దకు రౌండ్ టేబుల్ సదస్సులో పాల్గొనేందుకు ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నేతలు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న వర్సిటీ పోలీసులు ఫార్మసీ కళాశాల వద్దకు చేరుకుని సమావేశం వద్దంటూ నేతలను వెళ్లిపోవాలని సూచించారు. తాము రౌండ్ టేబుల్ సదస్సుకు వర్సిటీ ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందామని పోలీసులకు విన్నవించినప్పటికీ అనుమతి లేదంటూ సమావేశాన్ని జరగనివ్వకపోవడంతో ఫార్మసీ కళాశాల బిల్డింగ్ నుంచి ప్రజా సంఘాల నేతలు బయటకు వచ్చారు. పోలీసుల తీరును నిరసిస్తూ ప్రజా సంఘాల నేతలు వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి మొదటి గేటు వరకు నిరసన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశంలో శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. పీడీఎస్‌యూ రౌండ్‌టేబుల్ సదస్సు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలు నిరసించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు, పౌర ప్రజాస్వామిక సంఘాలు కార్యక్రమాలు చేపట్టాయని అన్నారు. రౌండ్ టేబుల్ సదస్సు నిర్వహించే హాల్‌కు పోలీసులు తాళాలు వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు తేడా ఏమీలేదన్నారు. మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాణి, నేతలు జయంత్, టీపీఎస్ రాష్ట్ర నేతలు బి.రమాదేవి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్‌రావు, భారత్ బచావో నేతలు వెంగల్‌రెడ్డి, ప్రవీణ్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజయ్, డీఎస్‌పీ నేతలు శివ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, ఉదయ్‌సింగ్, చార్వాక బాసిరెడ్డి, జనగాం కుమారస్వామి, హరిబాబుతో పాటు విద్యార్థి సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెర తీసి.. మొదటి కల్లు పోసి..

- ఘనంగా పండుతాళ్ల కల్లు పండుగ
- గ్రామ పెద్దలను తాటివనానికి ఆహ్వానించిన గీతకార్మికులు
- జనగామ జిల్లా ఇప్పగూడెంలో అనాదిగా వస్తున్న ఆచారం


కల్లు పండుగలో భాగంగా గ్రామ పెద్దలకు కల్లు వంచుతున్న గీతకార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో శుక్రవారం గీతకార్మికులు పండుతాళ్ల కల్లు పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ యేడు లాగానే తాటిచెట్ల నుంచి పండుతాళ్ల కల్లు రాగానే కులాలకు అతీతంగా గ్రామానికి చెందిన పెద్దలను తాటివనానికి గీతకార్మికులు ఆహ్వానించారు. అతిథులను ఒక దగ్గర కూర్చోబెట్టి చెట్ల నుంచి వచ్చిన మొదటి కల్లు పోయడంతో పాటు గుడాలను అందించారు. వివిధ కులాలకు చెందిన కుల పెద్దలకు, కల్లు ప్రియులకు గీతకార్మికులు ఏమి ఆశించకుండా కల్లుపోసి గుడాలు అందించి పండుతాళ్ల కల్లు పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా గీతకార్మికులు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పండుతాళ్ల పండుగను నిర్వహించే సంస్కృతి గ్రామంలో ఉందన్నారు. పూర్వ కాలం నుంచి పండుతాళ్ల కల్లుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వేసవి కాలం మొదలు సమయంలో పరుపుతాళ్లు ఉంటాయన్నారు. అనంతరం కార్మికులం తాటిచెట్టుకు ఉన్న తాటికాయలను కోస్తూ కల్లు పారడానికి గాను కత్తులతో మెరలు తీస్తామని తెలిపారు. తాటిగెలల నుంచి కల్లు పారడానికి అనేక రోజులు శ్రమించాలని చెప్పారు. అనేక మార్లు వ్యయ ప్రయాసలకు ఓర్చి గెలలకు ఓపికతో మెరలు పెట్టినప్పుడు కల్లు పారుతుందన్నారు. మొదటిగా తాటిచెట్ల నుంచి తీసిన పండుతాళ్ల కల్లును వనం మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు సాక పోసి కల్లు పండుగను నిర్వహించడం జరిగిందన్నారు. ఆతిథ్యం స్వీకరించిన గ్రామ పెద్దలు తోసిన విధంగా కట్నాలుగా కార్మికులకు డబ్బులు అందిస్తారని పేర్కొన్నారు. గీతకార్మికులు జూలూరు వెంకటేశ్వర్లు, జూలూరు మహేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాస్కర్ గౌడ్, రాజుగౌడ్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల పనులు

ఇంకా పెండింగ్‌లోనే..!

పుష్కరాలు పూర్తయినా పూర్తి కాని పనులు

మహదేవపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో పుష్కరాలు విజయవంతంగా పూర్తయ్యాయి. కాని పుష్కరాల కోసం విడుదల చేసిన నిధులతో ఏర్పాటు చేసిన పనులు మాత్రం ఇంకా పూర్తి కాలేదు.. నిత్యం కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు గాను గోదావరి ఒడ్డున ప్రత్యేకంగా సరస్వతి ఘాట్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించి రూ.35 కోట్లు కేటాయించినా అందుకు సార్థకత ఉండడం లేదు. పుష్కరాల ముందు మొదలు పెట్టిన పనులు ఇంతవరకు పూర్తికాకపోవడం విడ్డూరమని పలువురు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ చేపట్టిన ఆర్చిగేటు, కళ్యాణకట్ట, బట్టలు మార్చుకునే గది, మూత్రశాలల, మరుగుదొడ్ల పనులు మాత్రం మధ్యలోనే ఆగిపోయాయి.

పనులు ఆలస్యంగా ప్రారంభించడం.. ఇంతలోనే పుష్కరాలు రావడంతో స్లాబ్ లెవల్ పనులు పూర్తి చేసి అలాగే వదిలేశారు. ప్రసాదశాల పనులు ఇంతవరకూ పూర్తికాలేదు. రూ.కోట్లు వృథాగా పోతున్నాయని, వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భక్తులకు సౌకర్యంగా ఉండేలా పెండింగ్ పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.


స్లాబ్‌కే పరిమితమైన కల్యాణ కట్ట పనులు

సాగుకోసం..సలహాదారుడు

- ప్లాంటిక్స్ యాప్ అందుబాటులోకి తెచ్చిన 'ఇక్రిసాట్'
- అన్ని సమస్యలకు పరిష్కారం చూపేలా రూపకల్పన
- చీడపీడల ఫొటో తీసి పంపితే క్షణాల్లో నివారణ చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

రైతుల కోసం ఓ యాప్ అందుబాటులోకి వచ్చింది. సాగులో ఎదురయ్యే అన్ని సమస్యలకు ఇది పరిష్కారం చూపుతుంది. తగిన సలహాలు సూచనలు అందిస్తుంది. పంట తెగుళ్లు, చీడపీడలు, క్రిమి కీటకాలకు సంబంధించిన ఫొటోలు పంపిస్తే నివారణ చర్యలను సూచిస్తుంది. వాతావరణ వివరాలు, గాలిలో తేమ, ఉష్ణోగ్రత వివరాలను తెలియజేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మీ స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్ ఉంటే ఒక శాస్త్రవేత్త మన దగ్గర ఉన్నట్టే..



ప్లాంటిక్స్ యాప్ సమాచార చిత్రాలు

వరంగల్ వ్యవసాయం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో వ్యవసాయానికి కొత్త హంగులు అద్దుతూ సాంకేతితను జోడిస్తూ హైదరాబాద్ ఇక్రిసాట్ విశ్వవిద్యాలయం వ్యవసాయదారుల కోసం ప్లాంటిక్స్ అనే యాప్‌ను రూపొందించింది. రాష్ట్రంలో, దేశంలో ఏ మూలన ఉన్నా సరే.. అరచేతిలోనే మీ సమస్యలకు పరిష్కారం చూపుతుంది. ఇందుకోసం గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ప్లాంటిక్స్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. ఇందులో అన్ని పంటలకు సబంధించిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్యపద్ధతులు, చీడపీడలు, తెగుళ్ల నివారణ, పోషకాలు, సూచనలు, సలహాలు ఒకటేమిటి రైతుకు సంబంధించిన సమస్త సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు. గతంలోనైతే పంట వేసిన అనుభవజ్ఞులైన రైతులు, లేదా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకునే వారు. ఇప్పుడు పంటకు పట్టిన చీడపురుగు, తెగుళ్లకు సంబంధించిన ఫొటోలు తీసి పంపితే చాలు దాని నివారణ కోసం ఏం చేయాలనేది యాప్ ద్వారా పూర్తిసమాచారం తెలుసుకోవచ్చు.

సమస్య ఏదయినా పరిష్కారం సూచిస్తుంది..

కూరగాయలు, పండ్ల తోటలు, పప్పు దినుసులు, అపరాలు ఇలా ఏ పంట పండించినా వాటి సాగు విధానం, సస్యరక్షణ చర్యల గురించి ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. వాతావరణ పరిస్థితులు, గాలిలో తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో వేగం తదితర అన్ని అంశాలను ఇందులో పొందుపరిచారు. ఫోన్ జీపీఎస్ ఆన్ చేస్తే చాలు ఆ ప్రాంతానికి సంబంధించిన సమాచారమంతా వెల్లడిస్తుంది.

సమస్త సమాచారం..


ప్రాంతం, భాష ఏదయినా సరే మీ పంటకు సంబంధించిన సమస్యలకు ప్లాంటిక్స్ యాప్ పరిష్కారం చూపుతుంది. ఇక పంట తెగుళ్లు, చీడపీడల సమస్యలను నిపుణులకు తెలియజేయడంతో పాటు వాటి పరిష్కారాన్ని పొందే అవకాశం కూడా ఈ యాప్‌లో ఉంది. సమస్యలకు సంబంధించిన ఫొటోలను తీసి పంపితే వెంటనే ఆ పంటకు సోకిన వ్యాధి ఏమిటో వెల్లడిస్తుంది. అంతేకాదు ఆ వ్యాధికి వాడాల్సిన పురుగు మందులను కూడా సూచిస్తుంది. అవి ఏ మోతాదులో వాడాలో కూడా వివరిస్తుంది. యాప్‌లో కమ్యూనిటీ ఆప్షన్‌లోకి వెళితే.. సహచర రైతులు, నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతుల అనుభవాలు, సందేహాలను పంచుకునే అవకాశం ఉంటుంది. పంటలాభాన్ని అంచనా వేసుకోవచ్చు. తనకు సమీపంలో ఏయే ఎరువులు, పురుగుమందుల దుకాణాలు అందుబాటులో ఉన్నాయో కూడా ఇది చూపిస్తుంది.

యాప్ చాలా అద్భుతంగా ఉంది..



పంటలకు సంబంధించిన సమస్త సమాచారం తెలుసుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ యాప్ ఉంటే ఒక శాస్త్రవేత్త మన వెంట ఉన్నట్టే. పంట చేల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఈ యాప్ రైతులందరికీ చేరితే బాగుంటుంది.

- భూక్యా బాలునాయక్, రైతు, మరిపెడ



బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

గోవిందరావుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో గొంది దివాకర్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన బడిబాట ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కె.సోమిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రఘురాం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

●ఏటూరునాగారం : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని శంకరాజుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని శంకరాజుపల్లి గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ తీసి, సమావేశం నిర్వహి ంచారు. కాగా, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అంతేకాకుండా రాంనగర్ పాఠశాల జరిగిన బడిబాట కార్యక్ర మంలో హెచ్‌ఎం ప్రవీణ్ హాజరయ్యారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గణపురం : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి రాజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని చెంచుకాలనీలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో ఉప్పలయ్య, సీఎంవో రమేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

●భూపాలపల్లి టౌన్ : మండలంలోని కమలాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలను తప్పకుండా బడిలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు.



గోవిందరావుపేటలో బడి బాట కార్యక్రమం దృశ్యం



తాడిచర్లలో మాట్లాడుతున్న ఎంపీడీవో

●మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్లలో శుక్రవారం బడిబాట గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. రుద్రారంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట: మండలంలోని కమలాపురం మంగపేట నర్సింహసాగర్ మల్లూరు తిమ్మంపేట మల్లూరు తదితర గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమాలను విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో బ్యానర్లు ప్లకార్డులు చేతపట్టుకొని ర్యాలీలు నిర్వహించి పలు రకాల నినాదాలు చేశారు. కార్యక్రమాలలో స్థానిక తహసీల్దార్ టి. రవిందర్ ఎంఈవో పొదెం మేనకలు హాజరై మాట్లాడారు ఆయా పంచాయతీ కార్యదర్శి లు, హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

● కాటారం : ప్రజలు, ఉపాధ్యాయులు అందరు కలిసి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలని మండల విద్యాధికారి, దేవరాంపల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీదేవి అన్నారు. శుక్రవారం రేగులగూడెం జీపీ ఆవరణలో బడిబాట గ్రామసభ నిర్వహించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

చిట్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సత్తాచాటి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ వరంగల్ పార్లమెంట్ కోకన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్‌రావు మాట్లాడారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, మండల ప్రధానకార్యదర్శులు షైదం శ్రీకాంత్, రావుల రాకేష్, నాయకులు చెక్క నర్సయ్య, జగ్గయ్య, సుదగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, సంపత్, రఘు, కుమారస్వామి పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన జీఎస్పీ నాయకులు

వెంకటాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్‌ను శుక్రవారం గోండ్వాన సంక్షేమ పరిషత్(జీఎస్పీ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మండలంలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, నాయకులు చంటి, భీమయ్య, రాజేష్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ, ఏటీసీలలో దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కాలేజీలో విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు తమ ఒరిజినల్ ధృవపత్రాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అన్నారు. ఐటీఐ/ఏటీసీలో రెండు, ఒక సంవత్సరం కోర్సులలో చేరేందుకు విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, సివిల్, కోపాతో పాటు అధునాతన ఏటీసీ కోర్సులు సీఎన్‌సీ, మెషినింగ్ టెక్నీషియన్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, అడిటీవ్ మాన్యూ ఫ్యాక్చరింగ్, 3డీ ప్రింటింగ్ , ఇండస్ట్రియల్ రోబోటిక్స్ కోర్సులలో దరఖాస్తులు చేసుకోవ్చని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు కోసం ఐటీఐ కాలేజీలో సంప్రదించాలన్నారు.

బిల్లులను తగ్గించేలా చర్య తీసుకోవాలి

ఏటూరునాగారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అధికంగా వచ్చిన కరెంట్ బిల్లులను తగ్గించేలా వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు కోరారు. శుక్రవారం కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కరెంట్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఏఈ బండారి అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు. టెక్నికల్, మ్యానువల్ రీడింగ్‌ల వల్ల ఎదురువుతున్న సమస్యలపై వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, వావిలాల చిన్నఎల్లయ్య, యూత్ జిల్లా కార్యదర్శి ఎమ్డీ. గౌస్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, గంపల శివకుమార్, మాజీ టౌన్ అధ్యక్షుడు తాళ్లపల్లి నరేందర్, కె. రతన్‌కుమార్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి హఠాన్మరణం

భూ భారతి సదస్సుకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటు



రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ తహసీల్దార్ కర్ర శ్రీపాల్‌రెడ్డి(46) గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. కుటుంబసభ్యులు, ఉద్యోగుల కథనం ప్రకారం... హనుమకొండలోని 'కుడా' కాలనీలో నివాసం ఉండే శ్రీపాల్‌రెడ్డి ఉదయం నిద్రలేచిన అనంతరం భూ భారతి సదస్సుకు వెళ్లాలని బ్రేక్‌ఫాస్ట్ సిద్ధం చేయమని కుటుంబసభ్యులకు చెప్పాడు. అయితే అంతలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబసభ్యులు సమీపంలో ఉండే వైద్యుడిని ఆశ్రయించి సీపీఆర్ చేసి సుబేదారిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీపాల్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన శ్రీపాల్‌రెడ్డి.. హనుమకొండ, వరంగల్ జిల్లాలల్లో ఆర్ఐ, డీటీగా విధులు నిర్వర్తించి తహసీల్దార్‌గా పదోన్నతిపై అదిలాబాద్‌కు వెళ్లారు. ఎన్నికల సమయంలో హనుమకొండ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టి విధుల్లో కొనసాగుతున్నారు. శ్రీపాల్ రెడ్డి మరణం విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు, హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది వచ్చి మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం వాజ్‌పేయి కాలనీలోని స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ సారైనా.. చక్క బడేనా..!?

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 265 పాఠశాలలను దత్తత తీసుకుంది. వీటిలో తాగునీరు, మరుగుదొడ్ల రిపేరు, మైనర్ రిపేర్లు, విద్యుత్ పనులు చేయాల్సి ఉంది. దీనికి గాను 940 పనులు ఇచ్చారు. ఇందులో 205 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఇంకా 60 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. కానీ వాటికి సంబంధించిన బిల్లులు సంబంధిత అధికారు లకు సమర్పించలేదని చెబుతున్నారు. ఈ పనులకు గాను రూ.12.40కోట్లు మంజూరుకాగా పనులు ఇంకా పూర్తికాలేదు.

- పనులు పూర్తిచేయిస్తాం.. డీఈవో రాజేందర్

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులు వేగవంతం చేపిస్తున్నాం. త్వరగా పూర్తయ్యేలా పురమాయిస్తున్నాం. అలాగే పలువురు నిర్వాహకులు బిల్లులు సమర్పించలేదు. వాటిని వాకబు చేస్తున్నాం. ప్రతీ పనిని క్షుణ్ణంగా పరిశీలించి అవి విద్యార్థులకు ఉపయోగపడేలా చేస్తాం. నీటి సౌకర్యం లేనిచోట గ్రామస్థులతో మాట్లాడి ఏర్పాటు చేపిస్తాం.

తెమడ పరీక్షల నిర్వహణకు ప్రణాళికలు తయారు చేసుకోవాలి

ములుగుటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామగ్రామాన తెమడ పరీక్షల నిర్వహణకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు వైద్యులు, సిబ్బందికి సూచించారు. టీబీ ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వందరోజులపాటు చేపట్టే క్యాంపెయిన్‌ను ఆయన శుక్రవారం ఏరియా ఆస్పత్రి ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పోషకాహారలోపం ఉన్న వారిని, హెచ్ఐవీతో బాధపడుతున్న వారికి, వ్యాధి నిరోధకత తక్కువ ఉన్న వారికి తెమడ పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు సమ్మయ్య, చంద్రమౌళి, రాజు, ల్యాబ్ టెక్నీషియన్, టీబీ ప్రోగ్రాం సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆర్థికసాయం

వాజేడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురంకు చెందిన పైపూరి భీమేశ్వరరావు కుటుంబం దయనీయ స్థితిలో ఉండటంతో బీఆర్ఎస్ నాయకులు స్పందించారు. విషయం తెలుసుకున్న నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడెబోయిన బుచ్చయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డిలు స్పందించి రూ 10వేలు, 5కేజీల సన్నబియ్యంను అందజేశారు. కుటుంబ పెద్ద భీమేశ్వరరావు అనారోగ్యంతో మంచం పట్టగా ఇద్దరు కూతుళ్లలో ఒకరు దివ్యాంగురాలు. దీంతో చిన్న కూతురు, ఆయన భార్య కూలి పనులకు వెలుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ముడిగ తిరుపతియాదవ్, పూనెం నాగచంద్ర, యాలం చిట్టిబాబు, మడే కృష్ణయ్య పాల్గొన్నారు.

నష్టపరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలి

గోవిందరావుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఎంపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారి రవికుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో శుక్రవారం రత్నం రాజేందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి, ఎమ్డీ.దావూద్, పొదిళ్ల చిట్టిబాబు, కొప్పుల రఘుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు తీగల ఆదిరెడ్డి, సోమ మల్లారెడ్డి, గుగ్గిళ్ల దేవయ్య, జాగటి చిన్న, బచ్చల కృష్ణబాబు, దుగ్గి చిరంజీవి పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల ఎంపికకు సాధన చేయాలి

కాటారం, జూన్ 6(ఆంధ్రజ్యోతి):వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులంతా స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ముమ్మరంగా సాధన చేయాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ పంతకాని సమ్మయ్య అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం క్రీడా మైదానంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కాటారంలో శిక్షణపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైన 14మందిని అభినందించి జాతీయ స్థాయికి ఎంపికైన లోచన్ అనే విద్యార్థిని సత్కరించారు. వేసవి క్రీడా శిక్షణాశిబిరం విజయవంతానికి కృషి చేసిన నాయిని శ్రీనివాస్, శ్రీకాంత్ నాయక్, మద్ది సంపత్, రమేష్, దేవదాస్, ఆత్మకూరి కుమార్‌లను అభినందించారు. కోచ్‌లు అశోక్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

చెరుపల్లిలో బొడ్రాయి ఉత్సవాలు



బొడ్రాయి పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

మంగపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చెరుపల్లిలో శ్రీనాభిశిల బొడ్రాయి, భూలక్ష్మి మహాలక్ష్మి సహిత ముత్యాలమ్మ మైసమ్మ, గంగానమ్మ, నాగులమ్మ, ఎర్రమ్మ, శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం రెండు రోజుల నుంచి వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం గ్రామ దేవతల గుడులను శుద్ధిచేసి జలాభిషేకాలు, శాంతి హోమాలు శాస్త్ర ప్రకారంగా చిట్టోజు రామాచారి, గాదె నరేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో బృందం సభ్యులు నిర్వహించారు. గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎంపీడీవో విజయ బదిలీ

వాజేడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవో విజయ బదిలీ అయ్యారు. గత కొంత కాలంగా ఆమె పనితీరు పై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో ఆమె పై బదిలీ వేటు వేసినట్లు సమాచారం. ఆమె స్థానంలో ప్రస్తుతం ఎంపీవో గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ నాయుడు ని ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవో విజయను జిల్లా జడ్పీ సీఈవో కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మహదేవపూర్ తహసీల్దార్‌గా రామారావు

మహదేవపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ తహసీల్దార్‌గా వై.రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామారావు ఎన్నికల ముందు టేకుమట్ల తహసీల్దార్‌గా పనిచేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండలో పనిచేసిన అనుభవం ఉంది.

కొనసాగుతున్న భూభారతి సదస్సులు



వాజేడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కాటారం, జూన్ 6(ఆంధ్రజ్యోతి):భూభారతి రెవెన్యూ చట్టాన్ని అమలు చేయడానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని చింతకాని, ధర్మసాగర్ రెవెన్యూ గ్రామాల పరిధిలో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో పలువురు రైతులు, ప్రజలు భూసమస్యలపై చింతకానిలో 196, ధర్మసాగర్‌లో 49దరఖాస్తులు ఇచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్ నాగరాజు, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు..

● వాజేడు : మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని పెద్దగొల్లగుడెం, పూసూరు గ్రామాలలో రెవెన్యూ అధికారులు సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సులలో ముఖ్యంగా వారసత్వ పట్టామార్పిడి, పేర్లు మార్పు, 2ఏ భూములు అసైన్‌మెంట్ కింద మార్పు చేయడానికి దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సదస్సులలో తహసీల్దార్ ఎస్ శ్రీనివాస్, నాయూబ్ తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

●మంగపేట : గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించడం కోసం రైతుల వద్దకే అధికారులు వచ్చి నెరవేర్చడానికి ప్రత్యేక కృషి చేస్తున్నారని స్థానిక తహసీల్దార్ టి. రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అకినేపల్లి-మల్లారం నర్సింహసాగర్‌లలో గ్రామ రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సదస్సులను ఉద్దేశించి తహసీల్దార్ రవిందర్ నయాబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు మాట్లాడారు. ఆర్ఐలు శ్రీనివాస్ ఏసుపాదంలతో పాటు రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : గ్రామ సభలతో గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని రామన్నగూడెం, రాంనగర్, కోయగూడ ఎలాపూర్ గ్రామాలలో ఎస్సై ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మహిళలు శక్తి స్వరూపులు



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న రెహమాన్

ఏటూరునాగారం, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): మహిళలు శక్తి స్వరూపులు అని అటవీశాఖ సౌత్ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో అబ్దుల్ రెహమాన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, వావిలాల చిన్నఎల్లయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళలకు 60 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం : సిరికొండ



గెలుపొందిన క్రీడాకారులతో ప్రశాంత్

చిట్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిచడంతో పాటు శారీరక ధృడత్వానికి దోహదపడుతాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రశాంత్ మాట్లాడారు. ప్రథమ స్థానంలో నిలిచిన కేకేఆర్ జట్టుకు కప్, రూ. 40వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విక్టరీ11 జట్టుకు రూ. 20వేలు, కప్, తృతీయ స్థానంలో నిలిచిన చాలెంజర్స్, నాలుగో స్థానంలో నిలిచిన ఎలిమినేటర్స్ జట్టుకు కప్ అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జన్నె యుగందర్, చింతల రమేష్, శశికాంత్, రాములు, క్రీడా నిర్వాహకులు వేల్పుల రాజ్‌కుమార్, గడ్డం సాయినితిన్, లవన్‌బాబు, రంజిత్, వెంకన్న, ప్రకాష్, పూర్ణ, కిరణ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభం

ఏటూరునాగారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల స్పోర్ట్స్ కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభమైనట్లు ములుగు, భూపాలపల్లి జిల్లాల ఆర్‌సీవో టి. రి హరి సింగ్, ములుగు జిల్లా డీసీవో డి. శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బి. రాజు నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ ఒకేషనల్ గ్రూప్‌కు మొదటి సంవత్సరానికి పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని వారు పేర్కొన్నారు. అర్హులైన గిరిజన విద్యార్థులు వీలైనంత త్వరగా కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వీవర్స్‌కాలనీని విభజించొద్దని వినతి

ములుగుటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ములుగు మునిసిపాలిటీలో 20 వార్డులను ఏర్పాటుచేస్తూ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు వెలువరించగా జిల్లాకేంద్రంలోని వీవర్స్‌కాలనీని రెండు ముక్కలుగా విభజించారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం కాలనీవాసులు మునిసిపల్ కమిషనర్ సంపత్‌ను కలిసి వీవర్స్‌కాలనీని ముక్కలు చేయొద్దని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు బాసని రామ్మూర్తి, చిందం రాజమల్లు, కొండి సదానందం, రవీందర్, కందకట్ల భాస్కర్, ఏళ్ల మధుసూదన్, వంగ రవి, ఎల్లావుల అశోక్, అనుముల సురేష్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలి

తాడ్వాయి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ములుగు జిల్లాలో నిరుపేదలకు సొంత ఇంటి కల కలగానే మారిందని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్యాల మనోహర్ అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలంలోని నార్లాపూర్, పడిగాపూర్, ఎల్బాక గ్రామాల్లో పర్యటించారు. వెంటనే అర్హులైన వారి ఇండ్ల కేటయింపుల్లో నిష్పక్షపాతంగా అధికారులు మరోసారి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాల్లో రేషన్ కార్డు కూడా లేని వారికి ఇడ్లు మంజూరు కావడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక గ్రామాల యువజన సంఘాల నాయకలు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సింగరేణి ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం

భూపాలపల్లిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి సెక్యూరిటీ గార్డు కుటుంబానికి తోటి కార్మికులు ఆర్థిక సహాయం అందించి మానవతను చాటుకున్నారు. సింగరేణి ఎస్అండ్‌పీసీ విభాగంలో విధులు నిర్వహిస్తూ గత నెల 28న రేగొండ మండలం ప్రధాన రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నేర్పాటి మొగిలి అనే కార్మికుడు మృతి చెందాడని తెలిపారు. కాగా ఆయన దశదినకర్మ సందర్భంగా కుటుంబానికి రూ.75వేలు ఆర్థిక సహాయం అందించారు.సెక్యూరిటీ అధికారి చిలువేరు మురళీమోహన్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ జంగా లక్ష్మిరాజం, ఎస్అండ్‌పీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

వాజేడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లక్ష్మీపురంకు చెందిన కోరం అన్వేష్ అనే వ్యక్తి బైక్ మీద చీకుపల్లి నుంచి చెరుకూరు వైపు వెళుతుండగా మార్గమధ్యలోని చీకుపల్లి-పెదగొల్లగుడెం 163 జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి కిందపడిపోయాడు. మరల బైక్‌ను పైకి లేపి స్టార్ట్ చేద్దామని అనుకునే లోపు మంటలు అంటుకొని బైక్ దగ్ధమైంది. ఈ క్రమంలో రోడ్డు పై బైక్ తగలబడుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రహదారికి ఇరువైపుల భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కాగా స్థానికులు బైక్ దగ్ధం పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

డీజిల్ ట్యాంక్ ట్రాక్టర్ ఇంజన్ దగ్ధం

గణపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ట్రాక్టర్ డిజీల్ ట్యాంక్ పేలి ఇంజన్ దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని బంగ్లాపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పంచనేని విష్ణువర్ధన్‌రావు తన వ్యవసాయ భూమిలో కల్టివేటర్‌తో భూమిని సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా డిజిల్ ట్యాంక్‌లో మంటలు రావడంతో అప్రమత్తమై విష్ణువర్ధన్ బయటకు దూకాడు. దీంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

గోవిందరావుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే సంబంధిత షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పస్రా సీఐ రవీందర్ హెచ్చరించారు. శుక్రవారం మండలకేంద్రంలో ఫర్టిలైజర్‌షాపుల యజమానులు, విత్తన డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● వెంకటాపూర్: ఆరుగాల కష్టపడి పంటలు పండించే రైతులను ఫర్టిలైజర్ షాపుల యజమానులు మోసం చేస్తే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ హెచ్చరించారు. శుక్రవారం వెంకటాపూర్ మండలంలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయశాఖ అధికారి మాడూరి శైలజగౌడ్, తాహసీల్దారు గిరిబాబు, ఎస్సై సతీష్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులు, విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే కఠినంగానే వ్యవహరిస్తామన్నారు.

●కాటారం :ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలు, ఎరువులు, మందుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, వాటిని అమ్మితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి అన్నారు. హెచ్చరించారు. మండలంలోని ప్రతాపగిరి జీపీ పరిధిలో పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు డీఎస్పీ హాజరై మాట్లాడారు ఈ సదస్సులో ఎస్సై మ్యాక అభినవ్, ఏఈవో రాజన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రతాపగిరిలో మాట్లాడుతున్న కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

ఊరూరా ప'రేషన్'

(5వ పేజీ తరువాయి)

కొంత మంది డీలర్లు తమ వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారు. మూడు నెలల రేషన్‌కోటాపై ప్రజలను తప్పదోవ పట్టించే విధంగా డీలర్లు వ్యవహరిస్తున్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లబ్ధిదారులకు రేషన్ ఇవ్వకుండానే వేలిముద్రాలు వేయించుకొని ఒక నెల రేషన్ ఇచ్చి కొంత మంది డీలర్లు లబ్ధిదారులను దోచుకుంటున్నట్లు సమాచారం. రేగొండ మండలంలో ఇటీవల ఒక డీలర్ లబ్ధిదారుడి నుంచి మూడుసార్లు వేలి ముద్రలు సేకరించి ఒక నెల బియ్యం మాత్రమే పంపిణీ చేసినట్లు సమాచారం.

అధికారుల సాధారణ తనిఖీల్లో స్టాక్‌లో తేడాలు రావడంతో డీలర్లు అక్రమాలు బయట పడినట్లు సమాచారం. వెంటనే సదరు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ఇప్పటి వరకు 20శాతం బియ్యం పంపిణీ మాత్రమే

జిల్లాలో ఇప్పటి వరకు 20శాతం రేషన్ బియ్యం పంపిణీ మాత్రమే జరిగింది. మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ జరుగుతుండటంతో రేషన్ పంపిణీ ఆలస్యంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. మరోవైపు రేషన్‌బియ్యం పంపిణీలో అక్రమాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. తరుచుగా రేషన్‌షాపులను తనిఖీ చేస్తూ డీలర్లకు కేటాయించి కోటా వివరాలను తెలుసుకుంటూ పరిశీలిస్తున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల కొంత మంది డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి లబ్ధిదారులకు రేషన్ పంపిణీని సక్రమంగా జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.